


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 148 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 9 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 148 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 9 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు..

# ముగ్గురి మృతి

- సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద రోడ్డు ప్రమాదం
- నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీదద వెళుతున్న ఇద్దరిని ఈడ్చుకెళ్లిన కారు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మిగతా 2లో




## విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను తగ్గించుకోండి

- ఛార్జీలను 25 శాతం మేర తగ్గించుకోవాలని ప్రధాన విమానాశ్రయాలకు ఆదేశాలు
- మూడు నెలల పాటు తగ్గింపులు అందించాలని సూచన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో నష్టాలు చవిచూసిన విమానయాన సంస్థలు

మిగతా 2లో

# వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- దోచుకో.. పంచుకో.. తినుకో సిద్ధాంతంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్న జగన్
- రెండేళ్లలో చంద్రబాబు రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపణ
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని మడిపాటు
- వచ్చే సంవత్సరం పాదయాత్ర
- నా పాదయాత్రలో చంద్రబాబుకి రోజుకో సినిమా
- తాడేపల్లిగూడెం పార్టీ నేతల సమావేశంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి



**పెన్ పవర్ డెస్క్:** వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర మొదలవుతుందని, ఆ తరువాత చంద్రబాబుకు రోజుకో సినిమా చూపిస్తామని వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిగూడెం పార్టీ నేతలతో వైయస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి పాలనకు సగం టర్మ్ అయిపోయింది. మిగిలింది ఒక సగం టర్మ్ మాత్రమే. ఇంకో సంవత్సరం దాటితే, రేపటి సంవత్సరం వచ్చేసరికి నా పాదయాత్ర కూడా స్టార్ట్ అవుతుంది. దాని తర్వాత నేను కూడా రోడ్డుమీదకు వచ్చి ఒకటిన్నర సంవత్సరం ప్రజలతోనే నియోజకవర్గాల్లో తిరుగుతూ ఉంటాను. పాదయాత్ర స్టార్ట్ అయిన తర్వాత చంద్రబాబుకు ప్రతి రోజు సినిమా చూపిస్తాం.

మిగతా 2లో





## రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం,

# ఆర్థిక ప్రగతి

- రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా రహదారుల నిర్మాణం
- పోర్టులను అనుసంధానిస్తూ ఈస్ట్-వెస్ట్ కారిడార్ అభివృద్ధికి ప్రణాళికలు
- గోదావరి పుష్కరాల్లోపే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశం
- తక్కువ రవాణా వ్యయం కోసం ఈవీ బస్సుల వినియోగం పెంచాలని సూచన
- ప్రధాన నగరాలకు ఔటర్ కారిడార్ల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని నిర్దేశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో కేవలం ప్రయాణ సౌకర్యాల కోసమే కాకుండా, విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా పటిష్ఠమైన

మిగతా 2లో



## 'మావిగన్' నచ్చకపోతే 'అయోధ్య' అని పేరు పెట్టుకోండి

- మావిగన్ ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్
- వందేళ్లయినా అమరావతి పూర్తి కాదని వ్యాఖ్య
- అమరావతిలో రాధాకృష్ణ బ్యాచ్ ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని వ్యవహారం, ఏబీఎన్ రాధాకృష్ణ వ్యాఖ్య లపై మాజీ మంత్రి, వైసీపీ పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. కృష్ణా జిల్లా ముస్తాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అటు రాజధాని అంశంపై,

మిగతా 2లో

## 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

- కష్టపడిన వారిని గుర్తించడమే పార్టీ సిద్ధాంతమని లోకేశ్ స్పష్టీకరణ
- మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశం
- కార్యకర్తలను పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్న వైనం

మిగతా 2లో



## నేడు కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు...

## పోలింగ్ కు సర్వం సిద్ధం




- అసోం, కేరళ, పుదుచ్చేరిలో గురువారం ఒకే విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగం
- అసోంలో వరుసగా మూడోసారి గెలుపుపై బీజేపీ ధీమా
- కేరళలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ పోరాటం
- పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం పీఠంపై ఎన్. రంగస్వామి కన్ను

మిగతా 2లో

## ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...

# గవర్నర్ జోక్యం చేసుకోవాలి



- ప్రభుత్వ అప్పులపై ఆర్థిక శాఖ తప్పుడు లెక్కలు చూపిందని గవర్నర్‌కు బొత్స ఫిర్యాదు
- 2024-25లో రూ. 20,500 కోట్లకు పైగా అప్పులు తక్కువగా చూపారని ఆరోపణ
- ఆఫ్-బడ్జెట్ రుణాలు, పబ్లిక్ అకౌంట్ నిధులను దాచిపెట్టారని విమర్శ
- తప్పుడు సమాచారాన్ని ఉపసంహరించుకుని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మిగతా 2లో

## నారా లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్...

# సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

- మంగళగిరిలో 87వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి లోకేశ్
- విజయవాడ లోకో పైలట్ల గ్యాలా డిపో తరలించవద్దని సిబ్బంది వినతి
- కొవిడ్ నష్టాల నేపథ్యంలో ఆదుకోవాలని కోరిన హైర్ బస్సుల యజమానులు
- తమ భూమి కబ్జాకు గురైందని న్యాయం చేయాలని కోరిన కర్నూలు మహిళ
- వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేశ్ హామీ

మిగతా 2లో



## లెబనాన్‌పై ఇజ్రాయెల్

# భీకర దాడులు..

## ఒప్పందం నుంచి వైదొలగుతామన్న ఇరాన్... హర్మ్యాజ్ మళ్లీ మూసివేత

- మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి గండి
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో మళ్లీ రాజుకున్న వివాదం
- కీలకమైన హర్మ్యాజ్ జలసంధిని మరోసారి దిగ్బంధించిన ఇరాన్
- ఒప్పందం నుంచి వైదొలుగుతామంటూ అమెరికా, ఇజ్రాయెల్‌కు హెచ్చరిక
- చమురు రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

పెన్ పవర్ డెస్క్:మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం అమెరికా చొరవతో కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడమే దీనికి కారణమైంది. ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇరాన్, ఒప్పందం నుంచి వైదొలుగుతామని



మిగతా 2లో

# వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- మొదటి పేజి తరువాయి

**చంద్రబాబు చర్యలతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తున్నారు**

అన్నింటికన్నా ఆశ్చర్యం కలిగించే విషయం మావిగన్. నిజంగా చంద్రబాబుకు మోస్ట్ ప్రాక్టికల్ సొల్యూషన్ ఇచ్చాం. మనం చాలా లౌక్యంగా అయ్యా చంద్రబాబు గారు మీరు చేస్తున్న చర్యలతో రాష్ట్రానికి ఎప్పటికీ క్యాపిటల్ లేకుండా చేస్తున్నారు. అలా చేయడం వల్ల రాష్ట్రానికి మీ తీరుతో క్యాపిటల్ అనేది ఉండదు. ఇది మానుకోండి. అమరావతి అని మీరు రైతులను మోసం చేస్తున్నారు. అమరావతి అని ప్రజలను మోసం చేస్తున్నారు. ఆ అమరావతిలో రోడ్లు వేయడానికే, కరెంట్ ఇవ్వడానికి, డ్రైనేజీ వ్యవస్థ, నీళ్లు వంటి బేసిక్ వసతులు కల్పించడానికే నీ అంతట నువ్వే ఎకరాకు రూ.2 కోట్లు ఖర్చు అవుతుందని సెంట్రల్ గవర్నమెంట్‌కు, బ్యాంకులకు డీపీఆర్‌లు ఇచ్చావు. ఈ లెక్కన 50 వేల ఎకరాలకే లక్ష కోట్లకు దిక్కులేదు అనుకుంటే... మరో 50 వేల ఎకరాలు అని చెప్పి మళ్లీ భూ సమీకరణ చేపడుతూ... లక్ష ఎకరాల అమరావతి అని చెబుతున్నావు. ఈ లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లతో నీవు నిరంతరం రోడ్లు వేయడం, కరెంట్ ఇవ్వడం, డ్రైనేజీ పనులు చేస్తూనే ఉంటావు. నిరంతరం నీళ్లు ఇచ్చేందుకే అవస్థలు పడుతుంటే ఇక రాజధాని ఎప్పుడు వస్తుంది? ఎన్ని దశాబ్దాలు పడుతుంది? ఇప్పటికే 12 ఏళ్లు అయిపోయింది. 2014 నుంచి ఇప్పటి వరకు ఏమీ లేదు. ఇంకా ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియదు. డబ్బంతా రోడ్లకే, కరెంట్, నీళ్లకే ఖర్చు అవుతుంది. ఆ రెండు లక్షల కోట్ల విలువ దశాబ్దాలకు రూ.4 లక్షల కోట్లు అవుతుందో, ఇంకా ఎంత అవుతుందో తెలియదు. చివరికి 12 ఏళ్ల తర్వాత కూడా రాష్ట్రానికి రాజధాని లేదు. ఇంకా 20 ఏళ్ల తర్వాత కూడా అదే పరిస్థితి ఉంటుంది. అయ్యా చంద్రబాబు ఇది మానుకో. ఆ రెండు లక్షల కోట్లలో 10 శాతం ఖర్చు చేస్తే చాలు.

ప్లాన్-ఏ వద్దన్నారు..ప్లాన్-బీపై ఎందుకు ఆలోచన చేయడం లేదు? నేను ఇంతకు ముందు రాజధాని విషయంలో మంచి ఆలోచన చెప్పాను. ప్లాన్--ఏ కింద రాష్ట్రంలో అన్నింటి కన్నా పెద్ద నగరం విశాఖపట్నం... అందులో కార్యనిర్వాహక రాజధాని పెడితే ఎలాంటి ఖర్చు అవసరం ఉండదు. శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం అప్పట్లో మనం కర్నూలుకు మాటిచ్చాం, అది నెరవేర్చుతూ అక్కడ న్యాయ రాజధాని పెడుతూ... ఇక్కడే అమరావతిలో శాసన రాజధాని తీసుకువస్తే బాగుంటుందయ్యా అని చెబితే నానాయాగీ చేసి, రాజకీయాలు చేసి అవి వద్దు అన్నారు. సరే పోనీ అది వద్దు. కనీసం ఈ ప్రాంతంలోనైనా నీవు చేసే పనికి రాజధానినే లేకుండా పోతుందయ్యా. ఆ పని చేయకుండా కనీసం ఇక్కడైనా ఆలోచన చేయమని ప్లాన్--బీ కింద మావిగన్ ప్రతిపాదన తెచ్చాం.

**10 శాతం ఖర్చు చేస్తే ఇక్కడే బ్రహ్మాండమైన రాజధాని**

మచిలీపట్నంలో పోర్టు కట్టింది నీవు కాదు చంద్రబాబు, మేం కట్టాం. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పోర్టుకు భూసేకరణ చేపట్టాం. మన హయాంలోనే అనుమతులు తీసుకువచ్చాం. మన హయాంలోనే ఫైనాన్షియల్ క్లోజర్ చేశాం. అప్పట్లోనే బ్యాంకులతో నీట్‌గా టైఅప్ చేసి వర్క్ 30--40 శాతం కూడా పూర్తి చేశాం. ఆ పోర్టు పూర్తవుతుంది. మచిలీపట్నం నుంచి విజయవాడకు 70 కిలోమీటర్లు, విజయవాడ నుంచి గుంటూరుకు 40 కిలోమీటర్లు. మొత్తం ఈ 110 కిలోమీటర్లు హైవే ఉంది. విజయవాడలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంది. మచిలీపట్నంలో పోర్టు వస్తుంది. ఈ హైవేకు అటుఇటుగా అమరావతిలో కట్టే బిల్డింగ్‌లు ఇక్కడ కడితే బాగుంటుంది. మచిలీపట్నం నుంచి (మా), విజయవాడ నుంచి (వి), గుంటూరు నుంచి (గన్) అంటూ మావిగన్ ప్రతిపాదన చేశాం. ఈ 110 కిలోమీటర్ల ఎకనామిక్ కారిడార్‌ను క్యాపిటల్ కారిడార్‌గా డిక్లేర్ చేసి, ఆ కట్టే బిల్డింగ్‌లు ఇక్కడ కట్టండి. రెండు లక్షల కోట్లలో 10 శాతం ఇక్కడ ఖర్చు చేసి రోడ్లకు కనెక్టివిటీ ఇస్తే చాలు, బ్రహ్మాండమైన రాజధాని ఇక్కడే తయారు అవుతుంది. డే వన్ నుంచే రాజధాని వస్తుంది. ఒక గ్రోత్ ఇంజన్ తయారవుతుంది. కనీసం 20 ఏళ్ల తర్వాత అయినా మన పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడికక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. మావిగన్‌లోనే ఉద్యోగాలు దొరుకుతాయి అని చిలుకకు చెప్పినట్లు చెప్పినా, చంద్రబాబు ఒప్పుకోవడం లేదు.

**జగన్ ఏం చెప్పినా ఆహా అంటున్నారు..**

మనమంతా బాగా, లౌక్యంగా చెప్పినా గానీ ఆహా అంటున్నాడు. ఎందుకు అహా... ఎందుకు వద్దు... కారణం అక్కడ రెండు లక్షల కోట్లలో మొబిలైజేషన్ వర్కుల పేరుతో 8 శాతం కమిషన్లు తీసుకోవచ్చు. మావిగన్‌లో ఈ ఆదాయాలు ఉండవు కదా. కాబట్టి మావిగన్ వద్దు. అమరావతిలో కాంట్రాక్టర్లు ఎవరు అంటే ఒకడు ఈనాడు రామోజీరావు వియ్యంకుడు రఘు (ఆర్‌జీవీ), ఇంకొకరు బీఎస్ఆర్ (బల్క్ శ్రీనివాసరావు). వీరు చంద్రబాబు బినామీలు. అమరావతి కాంట్రాక్టర్లు అంతా వీళ్లే. దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం. అందుకనే మావిగన్ అంటే ఆహా... వైయస్ జగన్ ఏం చెప్పినా ఆహా అంటున్నారు.

# ఎడిటర్ వ్యూ

### నేడు కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు...

## పోలింగ్ కు సర్వం సిద్ధం

దేశవ్యాప్తంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రేపు (ఏప్రిల్ 9) గురువారం నాడు రెండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారు. మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఒక అగ్నిపరీక్షగా మారనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈ ఎన్నికల ఫలితాలను కూడా మే 4వ తేదీన ప్రకటించనున్నారు.

**అసోం**

అసోంలోని మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. 2016-2021 మధ్యకాలంలో శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తోంది. ఆరు పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బరిలోకి దిగుతోంది. అఖిల్ గొగోయ్‌కు చెందిన రైజోర్ దళ్, లురిన్‌జ్యోతి గొగోయ్ నేతృత్వంలోని అసోం జాతీయ పరిషత్ ఈ కూటమిలో కీలక పార్టీలుగా ఉన్నాయి.

రాష్ట్రంలో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు సమానంగా 1.25 కోట్ల మంది పురుషులు, మహిళలు ఉన్నారు. అలాగే 318 మంది ట్రాన్స్‌జెండర్లు, 18-19 ఏళ్ల మధ్య వయసున్న 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు.

**కేరళ**

దేశంలో కమ్యూనిస్టులకు చివరి కంచుకోటగా ఉన్న కేరళలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీపీఎం నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే, 2021లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) వరుసగా రెండోసారి గెలిచి ఈ సంప్రదాయానికి తెరదించింది. ఇంతకుముందు ఎల్‌డీఎఫ్ 1980, 1987, 1996, 2006, 2016లో అధికారంలోకి వచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఈసారి ఎలాగైనా తిరిగి అధికార పగ్గాలు చేపట్టాలని భావిస్తోంది. ఈ కూటమి 1982, 1991, 2001, 2011లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.

కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.39 కోట్ల మంది మహిళలు, 1.32 కోట్ల మంది పురుషులు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 4.66 లక్షల మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.

**పుదుచ్చేరి**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) అధినేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రి పీఠంపై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన 76 ఏళ్ల రంగస్వామి, 1990లలో మంత్రిగా పనిచేశారు.

2001లో తొలిసారి, 2006లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా 2008లో వైదొలిగి, సొంతంగా ఏఐఎన్ఆర్‌సీ పార్టీని స్థాపించారు. 2011లో మళ్లీ గెలిచి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2016-2021 మధ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించి, 2021లో ఎన్డీయే కూటమిలో భాగంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు.

ఇక్కడ మొత్తం 9.44 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 5 లక్షల మంది మహిళలు, 4.43 లక్షల మంది పురుషులు, 139 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 23,033 మంది యువత తొలిసారి ఓటు వేయనున్నారు.

### ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...

## గవర్నర్ జోక్యం చేసుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ తప్పుడు, అసంపూర్ణ సమాచారాన్ని శాసనమండలికి సమర్పించిందని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ఫిబ్రవరిలో జరిగిన మండలి సమావేశాల్లో ఓ ప్రశ్నకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన సమాధానంలో వాస్తవ అప్పుల వివరాలు పూర్తిగా లేవని, గణాంకాలను తక్కువ చేసి చూపారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ కాపీని వైసీపీ మీడియాకు విడుదల చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అప్పులు రూ. 60,485 కోట్లుగా పేర్కొన్నారని, అయితే కాగ్ (జూా+) ఆడిట్ ప్రకారం వాస్తవ నికర అప్పులు రూ. 81,082 కోట్లుగా ఉన్నాయని బొత్స వివరించారు. ఈ రెండింటి మధ్య రూ. 20,500 కోట్లకు పైగా తేడా ఉందని, దీనికి సరైన కారణాలు కనిపించడం లేదని తెలిపారు. ఆర్‌బీఐ నుంచి తీసుకున్న 'వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు', పబ్లిక్ అకౌంట్ కింద ఉన్న డిపాజిట్లు, రిజర్వ్ ఫండ్స్ వంటి ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం తన లెక్కల్లో కలపలేదని ఆయన ఆరోపించారు.

అంతేకాకుండా, 2025-26లో ఆఫ్-బడ్జెట్ రుణాలు ఏవీ లేవని ప్రభుత్వం చెప్పడం కూడా సరికాదన్నారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు సమీకరించారని, ఇవి కూడా ప్రభుత్వ అప్పుల కిందకే వస్తాయని గుర్తుచేశారు. శాసనసభకు తప్పుడు సమాచారం ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బొత్స అన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని, తప్పుడు సమాధానాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అలాగే, ఈ తేడాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనానికి సంబంధించిన విషయాల్లో పారదర్శకత చాలా అవసరమని బొత్స తన లేఖలో స్పష్టం చేశారు.

## రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

- మొదటి పేజి తరువాయి

కనెక్టివిటీ వ్యవస్థను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం రహదారులు-భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్వహణ, గుంతలు లేని రోడ్లు, ఈవీ బస్సుల వినియోగం, పోర్టు కారిడార్ల అభివృద్ధి వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**వివిధ నగరాలకు ఔటర్ కారిడార్లు**

రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఔటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. నగరాలకు రింగ్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

**రహదారుల పటిష్ఠ నిర్వహణపై సీఎం దృష్టి**

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ అత్యంత పటిష్టంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్లపై గుంతలు పడిన వెంటనే మరమ్మతులు చేపడితే సమస్యలు ఉండవని, ఇది నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ రహదారుల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్లు నిర్మించాలని, కాలువ గట్ల వెంబడి తరచూ దెబ్బతింటున్న 570 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతపై యూనివర్సిటీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

**గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ**

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 471 గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పుష్కరాల కోసం రూ.400 కోట్ల 'సాస్కీ' నిధులతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

**పోర్టుల అనుసంధానమే లక్ష్యం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పోర్టులు గుండెకాయ వంటివని, వాటిని కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని చంద్రబాబు అన్నారు. పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ తరహాలో, తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను పోర్టుల హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో లాజిస్టిక్స్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను అనుసంధానిస్తూ, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా నిర్మించాలని చెప్పారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను 'ఏపీ లింక్' ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

**ఆర్థిక ప్రగతికి జాతీయ రహదారుల కీలకం**

"జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రహదారుల నిర్మాణం ద్వారా సమీప ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తులకు కేంద్రంగా మారుతున్న ఏపీ నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరుకు రవాణా సులభతరం కావాలని చెప్పారు.

ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం-డోర్నాల, కల్వకుర్తి-నంద్యాల వంటి జాతీయ రహదారులతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాదిలోనే రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**తక్కువ వ్యయంతో ఈవీ బస్సులు**

ప్రజా రవాణాను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగమే సరైన మార్గమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం కిలోమీటరుకు రూ.72గా ఉన్న ఈవీ బస్సు నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు వివిధ మోడళ్లను అధ్యయనం చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అన్ని కేటగిరీల్లోనూ ఏపీ ఈవీ బస్సులనే నడపాలని, ప్రజల్లో ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించి దానిని ఒక మాస్ ట్రాన్స్‌పోర్ట్‌గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు..

హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది.

ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు.కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు..

- మొదటి పేజి తరువాయి

హెచ్చరించింది. అంతేకాకుండా, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండు వారాల పాటు యుద్ధ విరమణ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలను సురక్షితంగా కొనసాగించడం ప్రధాన షరతు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని, అక్కడి హెజ్బొల్లా బలగాలపై తమ సైనిక చర్యలు యథావిధిగా కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అన్నట్లుగానే, లెబనాన్‌పై, ముఖ్యంగా రాజధాని బీరట్‌లోని నివాస, వాణిజ్య ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ పౌరులు మరణించగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఇజ్రాయెల్ చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు. దాడులు ఇలాగే కొనసాగితే తాము ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, తమ అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే ఏ నౌకనైనా ధ్వంసం చేస్తామని ఇరాన్ సాయుధ దళాలు ప్రకటించాయి. ఇటీవల ఇరాన్ ఈ జలసంధిని నిరోధించినప్పుడు అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. తాజా పరిణామం మళ్లీ అదే ఆందోళనకు దారితీస్తోంది.వాస్తవానికి పాకిస్థాన్‌లో శాశ్వత శాంతి చర్చలు జరపాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ‌ద

అయితే, హర్మూజ్ జలసంధిపై పూర్తి సైనిక ఆధిపత్యం తమకే ఉండాలని, దాని ద్వారా ప్రయాణించే నౌకల నుంచి రుసుము వసూలు చేసే హక్కు కల్పించాలని ఇరాన్ కొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది. కానీ అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరస్పర విరుద్ధ వైఖరులతో మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. హర్మూజ్ జలసంధి భద్రతపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

కష్టపడి పనిచేసే వారిని గుర్తించడమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, 'మై టీడీపీ యాప్'ను సమర్థవంతంగా వినియోగిస్తున్న టాప్ 10 పెర్ఫార్మర్స్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ ఆత్మీయ భేటీ జరిగింది.ఈ సందర్భంగా లోకేశ్... పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వారి కుటుంబ నేపథ్యం, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ, సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్న కార్యకర్తల సేవలను ఆయన అభినందించారు.పార్టీకి కార్యకర్తలే బలమని, వారి శ్రమను ఎన్నటికీ విస్మరించబోమని లోకేశ్ భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఇలాగే పనిచేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు మంత్రి లోకేశ్ తో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## నారా లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్... సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గ్యాలా డిపోను తరలించవద్దని సిబ్బంది మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకునేందుకు రీప్లేస్‌మెంట్ వాహనాలను ఇప్పించాలని హైర్ బస్సుల యజమానులు కోరారు.కర్నూలు జిల్లా, గూడెంపాడుకు చెందిన ఎస్. చిన్న శివమ్మ అనే మహిళ తన వారసత్వ ఆస్తి అయిన 2.63 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని మంత్రిని అభ్యర్థించారు. ప్రజలు సమర్పించిన వినతులను సావధానంగా విన్న లోకేశ్, వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## 'మావిగన్' నచ్చకపోతే 'అయోధ్య' అని పేరు పెట్టుకోండి

- మొదటి పేజి తరువాయి

ఇటు మీడియా సంస్థల తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్ విసిరారు. వందేళ్లయినా పూర్తికాని అమరావతి పేరుతో కేవలం దోపిడీ చేస్తున్నారని, రాష్ట్రం అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కొత్త ప్రతిపాదన తెచ్చారని సమర్థించారు. "ఒకవేళ మావిగన్ నచ్చకపోతే ఆ ప్రాంతానికి అయోధ్య అని పేరు పెట్టుకోండి, కానీ దోపిడీ మాత్రం ఆపండి" అని అన్నారు. ఆడవాళ్లను కించపరిచేలా మాట్లాడినందుకు రాధాకృష్ణ తక్షణమే క్షమాపణలు చెప్పాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. కాశీకి వెళ్లి సిగ్గుశరం వదిలేసి వచ్చారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో దాదాపు 4 లక్షల కోట్లు అప్పు చేస్తే ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. వాలంటీర్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎందుకు బయటపెట్టడం లేదని అడిగారు.

కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. అమరావతిలో రాధాకృష్ణ 'బ్యాచ్' ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

## విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను తగ్గించుకోండి

దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం మేర తగ్గించుకోవాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విమానయాన సంస్థలకు మూడు నెలల పాటు ఈ తగ్గింపులు అందించాలని సూచించింది. ఇరాన్, అమెరికా యుద్ధం నేపథ్యంలో, దేశీయ విమాయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా సంస్థలు భారీ నష్టాలు చవిచూశాయి.దీనితో, విమానాశ్రయాలు వసూలు చేసే కొన్ని ఛార్జీలను తగ్గించేలా చూడమని ఆయా విమానయాన సంస్థలు కేంద్రాన్ని కేంద్రాన్ని కోరాయి. ఈ క్రమంలో కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్స్ ఎకనమిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలపై స్పందించింది. ఈ తాత్కాలిక ఛార్జీల తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది.

# తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందాలి



**జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:**తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతినెల సకాలంలో నిత్యావసర సరుకులు అందజేయాలని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదేశించారు.బుధవారం సాయంత్రం రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ గ్రామంలోని జీసీసీ డీఆర్ డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని లబ్ధిదారులకు సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.డిపో ద్వారా ఎన్ని మంది లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారో, ప్రతి నెల ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతోందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, నిర్వహణపై అధికారులకు సూచనలు ఇచ్చారు.ఈ తనిఖీలో ఏఎస్ఓ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులతో జగన్మోహన్ రెడ్డి భేటీ







**నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సమావేశం**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 08.**తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సుమారు 250 మంది వైఎస్సార్సీపీ స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక పరిస్థితులపై మాట్లాడారు. నాయకులు కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై పోరాటం చేయాలన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎలా ఉందో ప్రతీ ఒక్కరికీ తెలుసన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ 6 లంటూ మోసపూరిత హామీలు చేసి ఇంటింటికి వెళ్లి పవన్ కళ్యాణ్, చంద్రబాబు సంతకాలు చేసి మరీ బాండ్లు ఇచ్చారన్నారు. రెండేళ్ల పరిపాలన గడిచి మూడుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆ హామీలు అమలు చేసే పరిస్థితిలో లేరన్నారు. ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా మోసాలు గానే మిగిలిపోయాయన్నారు. మన హయాంలో మ్యానిఫెస్టో అన్నది ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాగా భావించి, 99 శాతం హామీలు నెరవేర్చి ప్రజలకు తలెత్తి చెప్పిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. మ్యానిఫెస్టోని చెత్తబుట్టలో పడేసిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలన్నీ చిన్నాభిన్నమైన పరిస్థితి ఈ ప్రభుత్వ హయాంలో నెలకొందన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, సుపరిపాలన, లా అండ్ ఆర్డర్ , సంక్షేమం, అభివృద్ధి అన్ని కూడా తిరోగమనంలోనే కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూములను పప్పు బెల్లం మాదిరిగా అమ్మేస్తున్నారన్నారు. షాపుకి పోతే రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలీదు కానీ ఆంధ్ర రాష్ట్రంలో రూపాయికి కోట్లు విలువ చేసే భూములు వస్తున్నాయని ఎద్దేవాచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రైవేటు స్కూల్స్ ప్రభుత్వ స్కూల్స్ పోటీపడ్డ పరిస్థితి నుండి ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. వచ్చే ఏడాదిలో మళ్ళీ పాదయాత్ర చేపడతామని ప్రతి ఒక్కరినీ కలుసుకుంటామన్నారు. ఏడాదిన్నర ప్రజల మధ్యలోనే ఉంటామన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా నియోజకవర్గ ఇంచార్జీ వడ్డి రఘురామ్ ద్వారా అందుబాటులో ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట మార్పిడిపై కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపు





**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 8:**బుధవారం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. తాళ్లపూడి మండలంలో ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయ్యాయని, మిగిలిన పంటలు కూడా కోతలకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో తేమ శాతం సమస్యలు తలెత్తవని వెల్లడించారు. బుధవారం మలకపల్లి గ్రామంలో శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మెట్ట ప్రాంతాల్లో రైతులు వరి బదులు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. వరి సాగులో వర్షాల వల్ల తేమ శాతం పెరగడం, పెట్టుబడి నష్టం వంటి సమస్యలు ఎదురవుతాయని, ఆయిల్ పామ్ సాగుతో అలాంటి ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. పంట మార్పిడి వల్ల భూసారం పెరుగు తుందని, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలధార కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా చెరువులను నింపి సాగు, త్రాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థులు తమ అనుభవాలను పంచుకుంటూ చెరువుల నింపుదలకు సూచనలు ఇవ్వాలని కోరారు. ఇంటర్‌లింక్ ట్యాంకులు లేదా పంపింగ్ ద్వారా చెరువులు నింపే చర్యలకు ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పూడిక తీత, ఇతర పనులను స్థానికులతోనే చేపడతామని చెప్పారు. కొవ్వూరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సరిపడా సంచులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మలకపల్లి గ్రామ పర్యటనలో భాగంగా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, శానిటేషన్‌పై సమీక్షించారు. టిబి వ్యాధిపై అవగాహన కల్పించే గోడ ప్రతులను ఆవిష్కరించారు. ముందస్తు పరీక్షలు, సరైన చికిత్సతో టిబిని పూర్తిగా నయం చేసుకోవచ్చని, ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సిఎస్‌బి గణేష్ కుమార్, ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే.తిలక్ కుమార్, ఇంచార్జి తహసిల్దార్ డి.దుర్గాప్రసాద్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రుచిత, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మద్దిపాటి ప్రకాశరావు, రాపాక రాజేశ్వరి, సిద్దా దుర్గాప్రసాద్, నామన పరమేశ్వరరావు, బేతిన నారాయణ, ఇందుగుల రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, గెద్దం జగన్, బోడపాటి గంగరాజు, కోడి శంకరరావు, తిగిరిపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

# జలధార--జల హారతి ద్వారా చెరువులు, చెక్‌డ్యామ్‌ల మరమ్మత్తులు వేగవంతం



**జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్**



**గంగవరం, పెన్ పవర్ ,ఏప్రిల్ 8:**పోలవరం జిల్లాలో రైతులకు సాగునీరు సమృద్ధిగా అందించే దిశగా చెరువులు, చెక్‌డ్యామ్‌ల మరమ్మత్తులను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు.బుధవారం గంగవరం మండలం గంగవరం గ్రామంలోని పెద్ద చెరువును ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జలధార--జల హారతి" కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో చెరువులు, చెక్‌డ్యామ్‌లకు అవసరమైన మరమ్మత్తులను చేపట్టి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నెల 6వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని అన్ని గ్రామాల్లో చెరువులు, చెక్‌డ్యామ్‌లను గుర్తించి, గ్రామ సభల తీర్మానాల ఆధారంగా మరమ్మత్తులు చేపట్టి సాగునీటి సదుపాయాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు. భూగర్భ జలాల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, సమగ్ర నీటి నిర్వహణ, చెరువులు--కాలువల పునరుద్ధరణ, నీటి సంరక్షణ నిర్మాణాలు, పచ్చదనం పెంపు, గ్రామ నీటి బడ్జెట్ అమలు వంటి అంశాలు ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపిడీ ఎల్. రాంబాబు, ఎంపీడీవో లక్ష్మణ్, ఏపీవో ప్రకాష్, ఏఈ వెంకటరమణ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ సర్పంచ్ బుల్లియమ్మ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సోలార్ మోడల్ విలేజ్‌గా మలకపల్లి ఎంపిక

- **కేంద్రం నుంచి కోటి రూపాయల గ్రాంట్**
- **జిల్లాలో తొలి మోడల్ విలేజ్ గా గుర్తింపు**
- **కలెక్టర్ కీర్తి చేకూరి**
- **ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**

**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 8:**జిల్లాలోని మలకపల్లి గ్రామం సోలార్ మోడల్ విలేజ్‌గా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కోటి రూపాయల ప్రత్యేక గ్రాంట్ మంజూరు కావడం ద్వారా గ్రామ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. బుధవారం మలకపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రధానమంత్రి ఎస్సీ-ఎస్టీ సూర్య ఘర్ యోజన ఉత్సవ్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం రెండు గృహాలలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గ్రామంలోని 68 గృహాలపై సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేయడం వల్ల జిల్లాలో తొలి సోలార్ గ్రామంగా గుర్తింపు పొందిందన్నారు. గ్రామానికి వచ్చిన గ్రాంట్‌తో పిహెచ్సీ, పాఠశాలలు, వీధి దీపాలు, త్రాగునీటి పంపింగ్ వంటి అవసరాలకు సోలార్ విద్యుత్ అందించే మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీని వల్ల భవిష్యత్తులో విద్యుత్ ఖర్చు గణనీయంగా తగ్గి, ఆ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నదని, అందులో భాగంగా ఉచితంగా 2 కిలోవాట్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూఫ్‌టాప్ ఉన్న ఇళ్ల యజమానులు ముందుకు వచ్చి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఇప్పటికే 4704 మంది దరఖాస్తు చేసుకున్నారని, దశల వారీగా యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీసీ, ఇతర వర్గాలకు 78 వేల రూపాయల సబ్సిడీతో పాటు బ్యాంకు రుణం సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే.తిలక్ కుమార్, ఇంచార్జి తహసిల్దార్ డి.దుర్గా ప్రసాద్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి రుచిత, టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఏఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మద్దిపాటి ప్రకాశరావు, మద్దిపాటి రామారావు, రాపాక రాజేశ్వరి, సిద్దా దుర్గాప్రసాద్, నామన పరమేశ్వరరావు, బేతిన నారాయణ, ఇందుగుల రామకృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు గెద్దం జగన్, బోడపాటి గంగరాజు, కోడి శంకర్రావు, తిగిరిపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.



# జల వనరుల సంరక్షణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు

- "జలధార -- జల హారతి" కార్యక్రమం అమలుకు చర్యలు వేగవంతం
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం పెన్ పవర్, ఏప్రిల్ 08:** పోలవరం జిల్లాలో జల వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు మరియు సమగ్ర నీటి వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం చేపట్టిన "జలధార -- జల హారతి" కార్యక్రమం అమలుకు జిల్లా యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల స్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేసి, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, డీడబ్ల్యూఎంఏ, ఆర్‌డబ్ల్యూఎస్, హార్టికల్చర్, వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ శాఖల అధికారులను సభ్యులుగా నియమించినట్లు వెల్లడించారు.మండల స్థాయిలో ఏఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఫీల్డ్ అధికారులు సమన్వయంతో పనిచేసి జల వనరుల పరిరక్షణ చర్యలను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో చెరువుల పూడికతీత, వాగుల శుభ్రత, రీచార్జ్ పిట్‌ల ఏర్పాటు, నీటి వృథా నివారణ వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి మండలంలో కమిటీలు నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ ప్రణాళికాబద్ధంగా పనులు అమలు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచి రైతులకు స్థిరమైన సాగునీటి వనరులు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు సమిష్టిగా పాల్గొని జల సంరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



## తాగునీటి సమస్య పరిష్కారానికి అత్యవసర చర్యలు





**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:** గ్రామంలో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కొల్లేరు పంచాయతీ ప్రత్యేక అధికారి డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర ఆదేశించారు .స్వర్ణ మొల్లేరు గ్రామంలో తాగునీటి సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు కూటమి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు.స్వర్ణ గ్రామ అధికారి మరియు పంచాయతీ ప్రత్యేక అధికారి కె. గోపన్న దొర ఆధ్వర్యంలో జరిగిన

సమావేశంలో నీటి సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్ డబ్ల్యు పి సి కేంద్రాన్ని సందర్శించి, గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ నిర్వహించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో పిఎసిఎస్ చైర్మన్ పాము అర్జున్, నీటి సంఘం అధ్యక్షులు జి. శ్రీరాములు, ఎన్. వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఎస్. వీరభద్రరావు, సచివాలయ సిబ్బంది డి. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలనకు ప్రజలందరి సహకారం అవసరం




డీఎంహెచ్ఓ డా. సరిత

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:** క్షయ వ్యాధి (టిబి) నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన "టీబీ ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా పెదగెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగరం, వాల్మీకి పేట, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సరిత మాట్లాడుతూ దేశం నుంచి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికతో గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.శిబిరంలో ఆధునిక హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే పరికరం ద్వారా 14 సంవత్సరాల పైబడిన వారికి ఉచితంగా స్క్రీనింగ్ నిర్వహించగా, ఏఐ సాంకేతికత ద్వారా ఒక గంటలోనే ఫలితాలు అందజేస్తున్నామని వివరించారు. మొత్తం 75 మందికి ఎక్స్-రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తూ, రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, కఫంలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రూనాట్ , సిబినాట్ యంత్రాల ద్వారా ఉచితంగా కఫం పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నుంచి 8 నెలల పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నామని చెప్పారు. అదనంగా, చికిత్స సమయంలో పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలల పాటు ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు.అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, ఎస్టీఎల్ఎస్ వంశీధర్, ఎంఎల్హెచ్‌పీలు కే. ప్రసన్న, ఎం. విజయకుమారి, ఎస్. సునీత క్రేజ తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ ద్వారా బాలల మేధాశక్తి పెంపు లక్ష్యం



జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఏప్రిల్ 8:** పోలవరం జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో బాలబాలికల మేధాశక్తి పెంపొందించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు.బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో 2026 సంవత్సరం 8వ పోషణ పక్వాడ పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 8 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలల మేధో వికాసం కోసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8వ పోషణ పక్వాడ కార్యక్రమం ఈ నెల 9 నుండి 23వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రం పరిధిలో నిర్వహించనున్నట్లు చెప్పారు.తల్లి-శిశు పోషణ, 0--3 సంవత్సరాల పిల్లల మెదడు అభివృద్ధి, 3--6 సంవత్సరాల పిల్లలకు ఆటల ఆధారిత విద్య, తల్లిదండ్రుల పాత్ర, స్క్రీన్ టైం తగ్గింపు వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు వివరించారు. అలాగే సమాజ మద్దతుతో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ప్రతి కేంద్రంలో బాలలకు ఆటపాటల ద్వారా విద్యపై ఆసక్తి పెంచే విధంగా అంగన్వాడీ టీచర్లు పనిచేయాలని, గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం పౌష్టికాహారం అందించాల్సిందిగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. ఉమా, డీఎంహెచ్ఓ పి. సరిత, ఐసీడీఎస్ సూపర్వైజర్లు సిహెచ్. రాఘవ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

## గాలీవాన బీభత్సం రైతుకు 'అకాల' దెబ్బ



**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:** అకాల వర్షం అన్నదాతలను దెబ్బ కొట్టింది. గాలీవాన బీభత్సం రైతుల ఆశలపై నీళ్లు గుమ్మరించింది. అన్నదాతలపై ప్రకృతి పగ బట్టిందా అన్నట్టుగా బుధవారం మధ్యాహ్నం సీతానగరం మండలంలోని పెనుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో పెనుగాలులతో కూడిన వర్షం రైతాంగానికి తీరని నష్టం మిగిల్చింది.ఇక, కోసి ఆరబెట్టిన ధాన్యం సైతం తడిసి పోయింది. గాలీవాన ఉధృతికి పలుచోట్ల కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. మరోవైపు, పొగాకు పాకలు నేలమట్టం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.బలమైన ఈదురుగాలుల కారణంగా ప్రధా నంగా వరికి అత్యధికంగా నష్టం వాటిల్లింది. రేపో, మాపో కోతకు సిద్ధంగా ఉన్న పైర్లు నేలకొరిగాయి. ధాన్యం గింజలు రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నేల కొరిగిన వరి పొలాల్లో కోత కోయడం కూడా రైతులకు ఇబ్బందికరంగా మారింది. నీరు, బురదలో ఒరిగిన ధాన్యం మొలకెత్తుతాయేమో.. గింజ రంగు మారుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరగా తెరవక పోవడంతో ఇప్పటికే కోతలు పూర్తిచేసిన రైతులు అమ్ముకోలేకపోయారు. కల్లాల్లో, రోడ్లపై కుప్పలుగా ఉంచిన వరి ధాన్యం కూడా తడిసి పోయాయి.ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని అందించాలని ఉన్న ధాన్యాన్ని ఆఫ్లైన్లో రైస్ మిల్లులకు చేరే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులుకోరుతున్నారు.

## శశి ఇంజినీరింగ్ -- ఎన్‌సీసీ కాకినాడ హెడ్‌క్వార్టర్స్‌తో కీలక భాగస్వామ్యం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 08:** శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ౘ ఇంజినీరింగ్ సంస్థ, ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ పరిధిలోని అన్ని బెటాలియన్లకు టెక్నాలజీ మరియు డ్రోన్ ట్రైనింగ్ భాగస్వామిగా వ్యవహరించనున్నట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎన్‌సీసీ కేడెట్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ ఆపరేషన్స్, సర్వేలు, సెక్యూరిటీ అప్లికేషన్స్ వంటి అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందించబడుతుంది.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహమ్ అగర్వాల్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సి.కె. నాయక్ పాల్గొన్నారు. వారు ఈ భాగస్వామ్యాన్ని అభినందిస్తూ, కేడెట్ల నైపుణ్యాభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శశి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ శ్రీ మేక నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ, యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడానికి మరియు దేశసేవకు సిద్ధం చేయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. సాసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ౘ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, ఇండస్ట్రీ-ఒరియెంటెడ్ ట్రైనింగ్ ద్వారా ఎన్‌సీసీ కేడెట్లకు మంచి అవకాశాలు కల్పించడం మా లక్ష్యమని చెప్పారు. ఈ భాగస్వామ్యం ద్వారా భవిష్యత్తులో సంయుక్తంగా మరిన్ని టెక్నికల్ ట్రైనింగ్ ప్రోగ్రాములు, వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## 2029 ఎన్నికల్లో తాడేపల్లిగూడెంలో వైకాపా జెండా రెపరెపలాడిస్తాం: వడ్డి రఘురామ్





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 08.** 2029 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం లో వైకాపా జెండా రెపరెప లాడిస్తామని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. బుధవారం ఆయన తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎనిమిదో వార్డ్ లో ఆర్కే కమ్యూనికేషన్ అధినేత, సీనియర్ వైకాపా నాయకుడు నారాయణ వెంకట రాంబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎనిమిదవ వార్డు ఇన్చార్జిగా నారాయణ వెంకట రాంబాబుని వడ్డీ రఘురాం నాయుడు నియమించారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ వైకాపా కార్యకర్తలకు, నాయకులకు తాను అండగా ఉంటానన్నారు. వైకాపా అభివృద్ధి కోసం పాటుపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## రామ్మోహన్ నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసిన గొర్రెల శ్రీధర్ కుటుంబ సభ్యులు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 08:** కేంద్ర విమానయానశాఖ మంత్రివర్యులు, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు, యువ నాయకులు కింజరపు రామ్మోహన్ నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ మరియు వారి కుటుంబ సభ్యులు

ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు శ్రీధర్ గతో మరియు వారి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# ఆంధ్రజ్యోతి ఎడిటర్ వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక కార్యాలయం ఎదుట వైసీపీ శ్రేణులు నిరసన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:**పత్రికారంగంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాధాకృష్ణ వంటి కుటిలుడు ఎవరు ఉండరని అతని తీరు పత్రికా రంగానికే మచ్చ ని వైఎస్ఆర్సిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ విమర్శించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాధాకృష్ణ తన పత్రికలో కొత్త పలుకు లో అమరావతి పై వ్యాసం లో ఆంధ్రప్రదేశ్లోని వైఎస్ఆర్సిపి పార్టీ మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. రాధాకృష్ణ వ్యాఖ్యలు నిరసిస్తూ స్థానిక ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో రాష్ట్ర మహిళలకు రాధాకృష్ణ బేషరత్ గా క్షమాపణలు చెప్పాలని, రాధాకృష్ణ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం, మీడియా ముసుగులో రాధాకృష్ణ కొత్త పలుకు కాదు చెత్త పలుకు, మహిళలను కించపరిచిన పచ్చ మీడియా విలన్ అంటూ వైసిపి ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాదులో ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట వేలాది మంది వైసీపీ శ్రేణులు చేశారంటే రాధాకృష్ణ కృష్ణ సిగ్గుపడాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో గత ఎన్నికల్లో కోటి 30 లక్షల మంది వైసిపి పార్టీకి ఓట్లు వేశారని గుర్తుంచుకోవాలన్నారు. చంద్ర బాబుకు లోకేష్ కు రాధాకృష్ణ భజన చేసుకున్న తమకు అభ్యంతరం లేదని, వైసిపి పార్టీ నేతలు, మహిళల జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పత్రికా స్వేచ్ఛ ముసుగులో అనుచిత రాతలతో వైసిపి పార్టీలోని నేతల భార్యలను చెల్లళ్ల తో పోల్చి చెత్త రాతలు రాయడం మహిళల మనోభావాలను కించపరచడమేనని మండిపడ్డారు. రాధాకృష్ణ తక్షణం రాష్ట్ర మహిళలకు భేషరతుగా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి చెత్త రాతలు రాసిన, వైసిపి మహిళలను కించపరిచిన సహించేది లేదని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి కార్యాలయం దగ్గర వైసిపి శ్రేణులు నిరసన ప్రదర్శన ఉద్రిక్తతకు దారి తీయకుండా సెంట్రల్ జోన్ డీఎస్పీ ఆధ్వర్యంలో , త్రీటౌన్ సి ఐ వి ఏ రావు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, రౌతు సూర్య ప్రకాశరావు, గూడూరి శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11 న ఫూలే జయంతి రోజున సామాజిక విప్లవం పై రాష్ట్ర సదస్సు

మీడియా సమావేశంలో ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల



**రాజమహేంద్రంవరం, పెన్ పవర్,ఏప్రిల్ 8:** ఆధునిక భారత జాతిపిత జోతిబా ఫూలే ద్విశతదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 11 వ తేదీన సామాజిక విప్లవం పేరిట రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు చెప్పారు. గోదావరి గట్టున ఉన్న ఫులే-ఆంబేద్కర్ భవన్ లో జరగనున్న ఈ సదస్సులో ప్రధాన వక్తగా బీసీ రిజర్వేషన్ల సిఫారసు యోధుడు బి.పి.మండల్ యాదవ్ మనుమడు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సురాజ్ యాదవ్ హాజరుకానున్నారని ఆయన తెలిపారు.బుధవారం ఫూలే ఆంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ , భారత దేశంలో సామాజిక విప్లవం అంశంపై ప్రొఫెసర్ సురాజ్ యాదవ్,ఫూలే సిద్ధాంతం - వర్తమాన పరిస్థితులకు అన్వయింపు అంశంపై తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు, కులం- నిర్మాణం - కూల్చివేత అంశంపై సీనియర్ జర్నలిస్టు మలసాని శ్రీనివాస్ ప్రసంగిస్తారని ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరవుతారన్నారు. సదస్సు అనంతరం వివిధ రంగాల్లో ప్రముఖులకు సత్కారం చేస్తామని చెప్పారు. ఇది ఫూలే 199 వ జయంతి వేడుకని ఏడాదిపాటు ఫూలే ద్విశతదినోత్సవ వేడుకలకను ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి 8 జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు. గ్రామ,మండల స్థాయిలో సదస్సులు,ఫూలే ఆంబేద్కర్ సాహిత్యంపై ప్రచారం చేస్తామని తెలిపారు.నెలకు ఒకసారి ఫూలే ఆంబేద్కర్ భవన్ లో సమావేశాలు జరుపుతామని నయనాల చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ,బొట్టా వీరబాబు, పుచ్చల రామకృష్ణ, పాల్గొన్నారు.

# యువ మేధావులు రాజకీయాల్లోకి రావాలి: ఎమ్మెల్యే బొలిశెట్టి.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 09.**స్వచ్ఛమైన రాజకీయాలు, నాణ్యమైన పరిపాలన రావాలంటే విద్యావంతులు,మేధావులైన యువత రాజకీయాల్లోకి రావాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటుకి నోటు ఇచ్చే దుస్థితి నుంచి రాజకీయాలు మారాలని ఈ మార్పు విద్యావంతులైన యువతతోనే సాధ్యమని ఆయన అన్నారు. ఇప్పటికే రాజకీయాలలో అనేకమంది సీనియర్లు ఉన్నారని, సీనియారిటీ కంటే మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త ఆలోచనలు నేటి తరానికి అవసరమని అన్నారు. సామాన్యుడికి రాజకీయాలలో ప్రవేశించే అవకాశం ఉండాలని అన్నారు. ధనం లేనిదే రాజకీయాల్లో మనుగడ సాగించే అవకాశం లేదని ఈ పరిస్థితి మారాలంటే విద్యావంతులయిన జర్నలిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లు, తదితర మేధావి వర్గాల నుంచి రాజకీయాల్లోకి రావాలని అప్పుడే మార్పు సాధ్యపడుతుందన్నారు.

అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రజలు ఇచ్చిన మద్దతుతో తాను గెలిచానని, అది తనపై పెద్ద బాధ్యతగా భావిస్తున్నానన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడం తన కర్తవ్యమని, ఎవరూ చెప్పకపోయినా బాధ్యతగా తీసుకుని పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణానికి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత రెండు సంవత్సరాల కృషి ఫలితంగా చాలా అభివృద్ధి పనులు చేశామని అన్నారు. వచ్చే ఐదేళ్లలో ఇంకా వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. విద్యార్థులు రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని, యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలు డబ్బుతో కాకుండా విశ్వాసంతో నడవాలని ఆయన పేర్కొన్నారు. ఎల్ ఈ డిలైట్లు, పార్కులు, జిమ్, క్రికెట్, ఇండోర్ స్టేడియాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. హైస్కూల్ను మోడల్ స్కూల్గా అభివృద్ధి చేశామని, ఈతకొలను కూడా సిద్ధంగా ఉందని వెల్లడించారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, నేత్ర,దంత వైద్యం తదితర విభాగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చిత్తశుద్ధి తో కృషి చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ను విశ్వవిద్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం హెడ్ డాక్టర్ హీరా, కిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఖైదీలు ఉచిత న్యాయ సహాయం వినియోగించుకోవాలి






డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:** తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్రీ లక్ష్మి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం , మహిళా కారాగారాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారాలలో ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఖైదీల తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు అవసరమైనా, బెయిల్ పిటిషన్లు దాఖలు చేయాలన్నా, పై కోర్టుల్లో అప్పీలు చేయాలన్నా ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు.ఈ సేవలను పొందేందుకు సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్ల ద్వారా తమ అర్జీలను సమర్పించాలని సూచించారు. ముద్దాయిలు, ఖైదీల కోసం పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.

# పన్నుల వసూళ్లలో సిబ్బంది కృషి అభినందనీయం



కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8 :**ఆస్తి పన్ను రికార్డు స్థాయి వసూళ్లలో రెవిన్యూ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక పీజీఆర్ఎస్ హాల్ నందు రెవిన్యూ యంత్రాంగంతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 82.41 శాతం పన్ను వసూళ్లు సాధించడం వెనుక రెవిన్యూ అధికారులు, సిబ్బంది కృషి ఉందని అన్నారు .రానున్న రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు. సకాలంలో పన్ను చెల్లించేవారిని ప్రోత్సహించడానికి 2026-27 ఆర్థిక సంవత్సరపు ఆస్తిపన్ను మొత్తాన్ని ఏకకాలంలో చెల్లించిన యజమాను లకు రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీని కల్పించిందన్నారు. ఒకేసారి ఆస్తిపన్నులు చెల్లించడం ద్వారా యజమానులకు కూడా ఐదుశాతం రాయితీతోపాటు వడ్డీ భారం తగ్గుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుకు సంబంధించి 50 శాతం వడ్డీ రాయితీని ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిదన్నారు. ఈ సదావకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకునేలా రెవిన్యూ యంత్రాంగం చొరవ చూపాలన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇటువంటి స్కీంలు దోహదపడతాయని, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కోటి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..





**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రియల్ 8:** కోరుకొండ మండలం కోటి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కూటమి నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ అయ్యేలా పారదర్శకత పాటిస్తున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.ధాన్యం నాణ్యత పరిశీలనలో రైతులకు అన్యాయం జరగకూడదని,తేమ శాతం విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో రైతులు పడ్డ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సకాలంలో కొనుగోలు ప్రక్రియను చేపట్టి రైతులకు అండగా నిలుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీరంగపట్నం సొసైటీ చైర్మన్ అడపా వీరబాబు,అడ్డాల శ్రీను,ముక్కా రాంబాబు, చదువు ముక్తేశ్వరరావు, గట్టి ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు, తన్నీరు తాతాజీ,వ్యవసాయ ఇతరులు పాల్గొన్నారు.

# వరల్డ్ హెల్త్ డే సందర్భంగా అవగాహన సదస్సు...



**అడ్డతీగల ,పెన్ పవర్, ఏప్రియల్ 08:**వరల్డ్ హెల్త్ డే సందర్భంగా అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం న్యాయ అవగాహనా సదస్సు మరియు సీజనల్ వ్యాధులు పట్ల అవగాహనా కార్యక్రమం డాక్టర్ పి. మహేష్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.
ముందుగా మండల లీగల్ సర్వీస్ కమిటీ,శ్యామ్ సుందరం,టి .బాబురావు ఇతర సిబ్బంది కలిసి చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎవరికైనా ఎటువంటి అవసరం వచ్చిన మా యొక్క లీగల్ టీం ను సంప్రదిస్తే మీకు ఉచితంగా మా యొక్క సేవలు మీకు అందిస్తామని తెలిపారు.
డాక్టర్ మహేష్ రెడ్డి మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈనెల పదో తారీకు జరుగు పి ఎం ఎస్ ఎం ఏ కార్యక్రమంలో మీకు తెలిసిన వారికి మీ చుట్టుపక్కల గ్రామంలో ఉన్న గర్భిణీ స్త్రీలు ఎవరైతే ఉన్నారో, వారు మన హాస్పిటల్ కి వస్తే ఉచితంగా పరీక్షలు మరియు మందులు,ఇచ్చి వారికి భోజన సదుపాయం కూడా కల్పిస్తామని తెలిపారు.
డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బయట చిన్నచిన్న ఆర్.ఎం.పీ లు పీ.ఎం.పీ లు, వద్దకు వెళ్లకుండా దగ్గరలో ఉన్న హాస్పిటల్ ని సంప్రదించాలని కోరారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఏమన్నా ఉన్నప్పటికీ , వెంటనే హాస్పటల్ కి వచ్చి సంప్రదిస్తే మీకు ఫస్ట్ ఎయిడ్ చేసి దానికి తగిన వైద్యం అందిస్తామని తెలిపారు.
హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు కూడా ఈ యొక్క ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా వేసవిలో వాటర్ బాటిల్ తమ వద్ద ఉంచుకోవాలని, అలాగే జ్వరం, దగ్గు ,కళ్ళు తిరిగి పడిపోవడం, నోరు ఆరిపోవడం, ఆవేశం రావడం, గుండెల్లో నొప్పి, వంటి వస్తే వెంటనే హాస్పిటల్ సంప్రదించాలని తెలిపారు.
మీకు ఎటువంటి అవసరం వచ్చిన వెంటనే,దగ్గరలో ఉన్న హాస్పిటల్ నీ సంప్రదిస్తే మీకు ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమం లో హాస్పిటల్ ఆయుర్వేదం వైద్యులు డాక్టర్ రేష్మ,దేవుడు, లక్ష్మి,సునీత, ఊహ, విజయ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో నీటి భద్రత, సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో..





**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్ 08:**నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమం లో భాగంగా బుధవారం తిమ్మాపురం గ్రామనీ అడ్డతీగల ఎంపీడీవో కుమార్ సందర్శించారు. ఇందులో భాగంగా ఊర చెరువు ఎం.ఐ ట్యాంక్ మరియు ఎం.ఐ ట్యాంక్ నూకాలమ్మ చెరువు పరిశీలించారు.ఈ రెండు చెరువుల్లో నీటి భద్రతను కల్పించడానికి మరియు భూగర్భ జలాల పునరు ఉత్పత్తి పెంచడానికి ,శాస్త్రీయ బేసిన్ ఆధారిత విధానాన్ని, సామాజిక భాగస్వామ్యం తో మేలవించు నీటిని సంరక్షించే కార్యక్రమం లో ఈ చెరువులను జల సంరక్షణ మరియు వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పునరు ఉత్పత్తి పెరిగి, చెరువులు అనుసంధానం, పచ్చదనం పెంపోందించే విధంగా తగు చెర్యలు గురించి జిల్లా కలెక్టర్ కి నివేదిక ఇచ్చామని అడ్డతీగల కుమార్ తెలిపారు.

## తాకూర్ పాలెం వయా కొత్తపల్లి అక్రమ మట్టి తోలకాలు






**పట్టించుకునే నాథులే లేరా.....**

**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 08:** –గోకవరం మండలం కొత్తపల్లిలో జోరుగా అక్రమమట్టి తవ్వకాలు జరుగు తున్నాయి నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్న ఈ అక్రమం మట్టి తవ్వకాలపై స్థానిక రెవిన్యూ అధికారులు కానీ పంచాయతీ అధికారులు కానీ ఇరిగేషన్ శాఖ అధికారులు కానీ కనీసం పట్టించుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. బుధవారం టాకురుపాలెం నుండి వయా అటవీశాఖ చెక్పోస్ట్ మీదుగా కొత్తపల్లి గ్రామానికి అక్రమ జోరుగా కొనసాగింది ఇటు గంగంపాలెం పంచాయతీ పరిధి తాకూర్ పాలెం రెవిన్యూ అధికారులు కానీ కొత్తపల్లి రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోకపోవడం తో ముడుపులు చేతులు మారినట్లు పుకార్లు బాటంగానే వినిపిస్తున్నాయి. ఒక్క తాగూర్ పాలెం నుండి కొత్తపల్లి మాత్రమే కాకుండా కొత్తపల్లి గ్రామం లో అనునిత్యం ఏ విధమైన అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ మట్టి తోలకాలపై స్థానిక రెవిన్యూ అధికారులకు తెలిసిన పట్టించుకోకపోవడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## చేబ్రోలు ఫ్లైఓవర్ ఎలైన్‌మెంట్ మారదు!





**రైల్వే అధికారుల ఖరాఖండీ హెచ్చరిక**
**"గ్రామసభ లేకుండా డిజైన్ ఎలా?"**
**నిర్వాసితుల నిలదీత**

**పెన్ పవర్, ఉంగుటూరు । ఏప్రిల్ 08:**విజయవాడ--విశాఖ రైలు మార్గంలో చేబ్రోలు రైల్వే గేటు వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. అయితే ఈ ఫ్లైఓవర్ నిర్మాణంతో చేబ్రోలు, నారాయణపురం గ్రామాలకు చెందిన పలువురు నివాసితులు, వ్యాపారస్తులు భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఇటీవల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో బాధితులు కలిసి ఫ్లైఓవర్ ఎలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ నేపథ్యంలో విజయవాడ నుంచి రైల్వే శాఖ అధికారులు బుధవారం చేబ్రోలు, నారాయణపురం గ్రామాల్లో పర్యటించారు. ఏఈఈ సత్యప్రసాద్ నేతృత్వంలోని బృందం నిర్వాసితులతో నేరుగా చర్చలు జరిపింది.
రైల్వే అధికారులు స్పష్టంగా మాట్లాడుతూ... ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనేక ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకే చేబ్రోలు ప్రాంతాన్ని ఖరారు చేశామని తెలిపారు. ఇప్పటికే డిజైన్ పూర్తయ్యిందని, సాంకేతిక అనుమతులు కూడా వచ్చేశాయని పేర్కొంటూ ఇప్పుడు ఎలైన్‌మెంట్ మార్పు అసాధ్యం అని ఖరాఖండిగా తేల్చేశారు. అయితే బాధితులు మాత్రం తీవ్రంగా స్పందించారు.
భూసేకరణకు ముందు గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా డిజైన్ ఎలా చేస్తారు? అంటూ అధికారులను నిలదీశారు. ప్రాజెక్టు అవసరమని చెబుతున్నా, భూములు కోల్పోయే కుటుంబాల భవితవ్యాన్ని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో తమ పేర్లు లేకపోయినా ఇప్పుడు డిజైన్ మారదని చెప్పడం అన్యాయమని, ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని నిర్వాసితులు మండిపడ్డారు.
ఫ్లైఓవర్ నిర్మాణం పేరుతో గ్రామాలపై భారం మోపకుండా, భూములు కోల్పోయే వారికి పూర్తి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## డైమండ్స్ లయన్స్ ప్రపంచ ఆరోగ్య అవగాహనదినోత్సవం...

✷ ప్రతి ఒక్కరూ ఆరోగ్యశీ పై అవగాహన





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 08:**డైమండ్స్ లయన్స్ ప్రపంచ ఆరోగ్యఅవగాహనదినోత్సవం...
ప్రతి ఒక్కరూ ఆరోగ్యశీ పై అవగాహన అవసరం అని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు
తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రెజరర్ బడుగు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో గుణ్ణం ఫంక్షన్ హాల్ లో ప్రపంచ ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆరోగ్య అవగాహనా కార్యక్రమం డాక్టర్ అమర్ నిర్వహించారు.ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. అలానే ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని పచ్చ దనం పరిశుభ్రత, పోషకాలు పౌష్టికాహారం, వ్యాయామాలు పై తరగతులు నిర్వహించారు లయన్ బడుగు చంద్ర శేఖర్ మాట్లాడుతూ సమాజం లో ఆరోగ్యం పై అవగాహనా శక్తి పెంచలనే తలంపు తోలయన్స్ జిల్లా 316జి గవర్నర్ లయన్ఎన్.వి.వి యస్ పాపారావు నాయుడు పిలుపు మేరకు డైమండ్స్ లయన్స్ సహకారం తో ఈ సేవా కార్యక్రమం జరిపా ము అన్నారు. ఈ కార్యక్రమం లో బడుగు అంజలి. టి. చిట్టెమ్మ. కె. ప్రశాంతి తులసీరత్నం, ఎన్క అంబి, కృష్ణవేణి, మణి, ఉమామహేశ్వరి, లక్ష్మి, శ్యామల, పద్మజ, వెంకటలక్ష్మి, నూకరాజు, శేఖర్ రెడ్డి, బండి శ్రీనివాసరావు, సూర్యావతి, సుంకరవెంకటేశ్వరరావు, దాసం వెంకటరమణ, సూర్యకుమారి, అమర్నాథ్, బుద్దన శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# మంచి వ్యక్తిత్వాన్ని స్థిరపరచుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలి

**ఈగల్ ఐ.జి.పి ఆకే రవి కృష్ణ**

**రాజమహేంద్ర వరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:**ప్రతి వ్యక్తి తన భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి, వెదురు చెట్టును ఆదర్శంగా తీసుకోవాలని, వెదురు తన వేర్లను భూమి లోపలికి ఎంత బలంగా విస్తరించుకొని పైకి ఎదుగుతుందో,దానివలె వ్యక్తి వ్యక్తిత్వాన్ని స్థిరపరచుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఈగల్ ఐ.జి.పి ఆకే రవి కృష్ణ అన్నారు.నన్నయ యూనివర్సిటీ , గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ లో జరిగిన యాంటీ ర్యాగింగ్, ఆల్కహాలిజం, డ్రగ్ అబ్యూజ్ ఓరియంటేషన్, సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈగల్ ఐ.జి.పి ఆకే రవి కృష్ణ కు
తూర్పు గోదావరి జిల్లా ఎస్పి డి. నరసింహ కిషోర్ ఘన స్వాగతం పలికారు. రాజానగరం, నన్నయ్య యూనివర్సిటీ లో వి సి ఎస్ ప్రసన్న శ్రీ అధ్యక్షతన , గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ లో, చైర్మన్ చైతన్య రాజు అధ్యక్షతన జరిగిన యాంటీ ర్యాగింగ్, ఆల్కహాలిజం, డ్రగ్ అబ్యూజ్ ఓరియంటేషన్, సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, ఆంధ్రప్రదేశ్, ఈగిల్ ఐ.జి.పి ఆకే రవికృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 1000 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్నీ ఐ.జి.పి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐ.జి.పి ఆకే రవికృష్ణ మాట్లాడుతూ,
మంచి విత్తనాలు నాటితే మంచి ఫలాలు వస్తాయని, మంచి ఆలోచనలు నాటాలని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించినారు.
ప్రతి వ్యక్తిలోనూ అంతర్లీలంగా శక్తి దాగి ఉంటుందని, గుర్తించి సాధన చేసి, సద్వినియోగం చేసుకుంటే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుం దన్నారు. యువత మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా కాలేజీల్లోనూ, యూనివర్సిటీల్లోనూ అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేసి, సుమారు 20 లక్షల మంది విద్యార్థులను చైతన్యపరి చామన్నారు. దేశం సాంకేతికంగా ఎంతో ముందుకు వెళ్తున్నదని, ఈ రంగంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకుంటూ, తమ జీవితాలను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. తమ పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటారన్నారు.
మత్తు పదార్థాల గురించి ఏ సమాచారం తెలిసిన 1972 కాల్ చేసి తెలపాలన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కు ఈగల్ కృషి చేస్తుందని, సుమారు 40 వేల విద్యా సంస్థల్లో ఈగల్ కమిటీలు నియమించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు





స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నేటి టెక్నాలజీ యుగంలో భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్ నేరాల పెరుగుదలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఏ సమాచారం వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు సమాచారం అందించా లన్నారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ బారినపడి ఆత్మహత్యలుచేసుకున్నరన్నారు.విశ్వవిద్యాలయం విద్యార్థులు గ్రంథాలయాన్నిఉపయోగించుకోవాలని, అధ్యాపకుల మార్గదర్శకంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాల జోలికి వెళ్ళనని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సీఐ లు, పి వి సూర్య మోహన్, వెంకటేశ్వరరావు , నరేష్ రాజానగరం ఇన్చార్జి సిఐ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## అర్హులందరికీ టిడ్కో ఇల్లు కేటాయింపు

* నగర వార్డుల్లో ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8 :**ఇళ్లు లేని అర్హులకీ త్వరలోనే టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం గోరంట్ల కార్యాలయం లో మున్సిపల్ , రెవెన్యూ అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా డి.బ్లాక్ లో నివాసముంటున్న ఒరియా పేట, టవర్ లైన్ వారికి టిడ్కో ఇళ్లు కేటాయించాలన్నారు . రాజమండ్రి నుండి ధవలేశ్వరం సాయిబాబా ఆలయం వద్ద పంపు హౌస్ కు మురుగునీరు చేరుకునే కాలువపై ఆక్రమణలు ఉన్నాయని, సర్వే చేసి వాటన్నిటిని తొలగించాలన్నారు . వర్షాకాలం వచ్చేనాటికి కోటిపల్లి బస్టాండ్ నుండి ధవలేశ్వరం వరకు మెయిన్ డ్రైనేజీ నిర్మించాల్సి ఉందని, రైల్వే శాఖ వారితో అనుసంధానం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగర వార్డుల్లో ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీ.వీ రామలింగేశ్వరరావు, ఎమ్మార్వో శ్రీనివాస్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 8:**జిల్లాలో మార్చి--2026లో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం మూల్యాంకన కేంద్రం లో సమీక్షించారు. స్థానిక బాల విజ్ఞాన మందిర్ ఉన్నత పాఠశాల, శ్రీరామ్ నగర్ (లలిత నగర్)లో జరుగుతున్న మూల్యాంకన కేంద్రాన్ని ఆమె సందర్శించి ఏర్పాట్లు, నిర్వహణ తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న విధానాలు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, మూల్యాంకనం పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. జవాబు పత్రాల పరిశీలనలో నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి పత్రాన్ని నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 1,76,032 జవాబు పత్రాల మూల్యాంకనం చేస్తున్నారని, ఈ ప్రక్రియ కోసం మూల్యాంకనాధికారులు, పర్యవేక్షకులు, రిజర్వ్ సిబ్బంది 755 మందిని నియమించినట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు కలెక్టర్ కు వివరించారు. ఈ మూల్యాంకన ప్రక్రియ ఈనెల 6నుండి 15 వరకు కొనసాగనుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా మూల్యాంకనం నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి. నాగమణి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం. అమల కుమారి, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందితో రివ్యూ సమావేశం



**వై రామవరం/ గుర్తేడు పెన్ పవర్, ఏప్రిల్ 8 :** గుర్తేడు మండలం గుర్తేడులో ఉపాధి హామీ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందితో రివ్యూ సమావేశం బుధవారం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.

ప్రతి గ్రామంలో డిమాండ్ ఆధారంగా అందరికీ పని కల్పించాలని తెలియజేశారు. ప్రతి వేతన దారుడు ఎన్.ఎం.ఎం.ఎస్ హాజరు తప్పనిసరి అని తెలియజేశారు. నీటి భద్రత గుర్తింపు పనులు గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం గుర్తేడు మండలంలో రబ్బర్,ఆర్టికల్చర్ రైతులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ దేవదానం, ఏపీవో స్వామి, సాంకేతిక క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## శ్రీ కోటిలింగేశ్వర స్వామి ఆలయానికి ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఏప్రిల్ 8 :** గోదావరి గట్టు కోటిలింగాల రేవులో కొలువైన కోటిలింగేశ్వరస్వామి ఆలయానికి మహిమాన్వితమైన ఆర్చ్‌ను నిర్మిస్తున్నట్టు సిటీ ఎమ్మెల్యే అన్నారు. స్థానిక కోటిలింగాలపేట రోడ్డు వద్ద రూ. 20 లక్షలతో నిర్మించతలపెట్టిన ఆర్చ్ నిర్మాణం పనులకు ఆలయ చైర్మన్ కొయ్యల రమణ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ తన హయాంలో కోటిలింగేశ్వర స్వామి ఆలయంకు వెళ్లే ప్రధాన మార్గంలో ఆర్చ్ నిర్మాణానికి అంకురార్పణ జరగడం ఆధ్యాత్మికత మూలాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దాతల సహకారంతో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ ఆర్చ్ నిర్మాణం రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన ఎండోమెంట్స్ మంత్రి నగరానికి వస్తున్నారని రూ. 7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు. రూ. 9 కోట్ల 10 లక్షల నిధులు నియోజకవ ర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు.

పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ ఈ ఆర్చ్ నిర్మాణం కోసం 15 సంవత్సరాలుగా ఎదురుచూ స్తున్నామని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో సాకారమైందని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కొయ్యల రమణ మాట్లాడుతూ తమ కమిటీ ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఆర్చ్ నిర్మాణం సంకల్పించామని, దాతల సహకారంతో ఆ సంకల్పాన్ని కార్యరూపం దాల్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక వ్యాపారవేత్తలు, భక్తులు విరాళాలు అందించారు. బిక్కిన రవి రూ. 1,01,118 విరాళం అందించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు గన్ని కృష్ణ, కాశీ నవీన్ కుమార్, అత్తి సత్యనారాయణ, , కంటిపూడి శ్రీను, బంగారు నాగేశ్వరరావు, జవ్వాది మురళి, బొర్రా చిన్ని, ఆలయ డైరెక్టర్లు తోట కిరణ్, గుబ్బల గంగాభవానీ, జొన్నా సత్యవేణి, వంగండ త్రివేణి, సంపంగి లక్ష్మీదుర్గ, అలజంగి దేవుడు, జీవీఆర్ రెడ్డి, నిమిష కవి, పిల్లి ప్రసాద్, మద్దుకూరి అనురాధ, తదితరులు పాల్గొన్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రామన్నపాలెంలో లే-అవుట్ లో అక్రమ గోశాల మూసివేసిన పోలీసులు

నిర్వాహకులకు ముందస్తు హెచ్చరిక నోటీసులు





**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 08:-** మండల శివారు కృష్ణునిపాలెం గ్రామ పరిధిలోని రామన్నపాలెంలో లే-అవుట్ లో ఎటువంటి నిర్వహణ పరిమితులు మరియు అనుమతులు లేకుండా గోశాల పేరుతో ఎటువంటి మౌలిక వసతులు లేకుండా జంతు సంరక్షణ చట్టానికి విరుద్ధంగా నడుపుతున్న ప్రదేశంలో దాడి చేసినట్లు గోకవరం ఎస్సై వి. ఎన్.వి. పవన్ కుమార్ బుధవారం తెలిపారు. సదరు నిర్వాహకులు మరియు ఇతరులకు నోటీసులు జారీచేసి సదరు అక్రమ గోశాలను పూర్తిగా మూసివేసినట్లు తెలిపారు. మండలంలో ఎటువంటి అక్రమ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావులేదని, మండలంలో ఎక్కడయిన గో అక్రమ రవాణా జరిగినా తన దృష్టి తీసుకురావాలని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

## ఏడువారాల వెంకన్నను దర్శించుకున్న విజయవాడ కనకదుర్గ దేవస్థానం చైర్మన్ బొర్రా రాధకృష్ణ



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8:**కోనసీమ తిరుమలగా భక్తుల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తి వాతావరణం నెలకొంది. విజయవాడ కనకదుర్గ దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనను అర్చకులు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, సేవలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో కలసి ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకున్నారు. భక్తుల విశ్వాసానికి కేంద్రంగా నిలిచిన ఈ ఆలయం ప్రాంతీయంగా "కోనసీమ తిరుమల"గా ప్రసిద్ధి చెందింది. ఏడువారాల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ద్వారా కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. దర్శనానంతరం ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు బొర్రా రాధాకృష్ణ దంపతులను దుస్సాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

## ఫైలేరియా నియంత్రణకు ముందడుగు: ఆత్రేయపురంలో కిట్ల పంపిణీ






**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8:**ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు బుధవారం ఎం ఎం డి కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి నక్క వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ చిటికెన వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి. సౌమ్య, డాక్టర్ హైమశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి. అరుణకుమారి పాల్గొన్నారు. అలాగే వైద్య సహాయకులు ఎం.టి.వి.ఎన్. మూర్తి, ఏఎన్ఎంలు మరియు ఆశా వర్కర్లు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫైలేరియా బాధితులకు అవసరమైన ఔషధాలు, సంరక్షణ పరికరాలతో కూడిన ఎం ఎం డి కిట్లు అందజేయడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి ఎంపీడీవో బి కె ఎస్ ఎస్ వెంకట రామన్





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 8:**మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రత్యేకంగా అర్హులైన ప్రతి కార్మికునికి ఉపాధి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. పనుల నాణ్యతను కాపాడుతూ వేగవంతంగా పూర్తి చేయడం, కార్మికులకు సమయానికి వేతనాలు అందేలా చూడడం పై దృష్టి సారించాలని సూచించారు. అలాగే పనుల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో చురుకుగా పనిచేసి, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఒ సి. హెచ్. విజయ రెడ్డి, సాంకేతిక సహాయకులు మండలంలోని అన్ని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. సమావేశం ద్వారా పథకం అమలులో మరింత చురుకుదనం తీసుకురావాలని అధికారులు సంకల్పించారు.

## ఒప్పుకుంటున్నా.. మా బౌలర్లను బుడ్డోడు వణికించిండు:
# సూర్యవంశీపై ముంబై కోచ్ ప్రశంసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ముంబై ఇండియన్స్?పై ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మంగళవారం (ఏప్రిల్ 7) గౌహతి వేదికగా జరిగిన ఈ మ్యాచులో ముంబైపై కేవలం 14 బంతుల్లోనే 39 రన్స్ చేసి రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ప్రపంచ మేటి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్?లో ఒకే ఓవర్లో రెండు సిక్సులు కొట్టి అందరిని ఔరా అనిపించాడు ఈ ఏళ్ల చిచ్చర పిడుగు. ప్రత్యర్థి జట్టు హెడ్ కోచే స్వయంగా వైభవ్?కు కితాబు ఇచ్చాడంటే అతడి బ్యాటింగ్ ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

ముంబై, రాజస్థాన్ మ్యాచ్ అనంతరం ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ ఎదుగుదల చూడటం చాలా ఉత్సాహంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాపై సూర్యవంశీ చూపిన పట్టుదల అందరి దృష్టిని ఆకర్షించిందని కొనియాడాడు. వైభవ్ తన డేరింగ్ అండ్ డాషింగ్ బ్యాటింగ్?తో ముంబై బౌలర్లు ఇబ్బంది పెట్టాడని జయవర్ధనే ఒప్పుకున్నాడు.

లాస్ట్ ఇయర్ ఐపీఎల్?లోనే అతడి టాలెంట్ ఏంటో ప్రపంచానికి తెలిసిపోయిందన్నాడు. వైభవ్ దగ్గర మంచి స్కిల్ ఉందంటూ అతని ఆత్మవిశ్వాసాన్ని, అగ్రశ్రేణి బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రశంసించారు. యశస్వీ జైశ్వాల్ కూడా ముంబైపై అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని అన్నారు. మొదటి మూడు ఓవర్లలో అతను బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతమని.. చాలా చక్కటి షాట్లు ఆడాడని ప్రశంసించారు. ఐపీఎల్ 19వ సీజన్లో రాజస్తాన్ రాయల్స్ హవా కొనసాగుతోంది. మెగా టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్లోనూ రాయల్స్ విజయం అందుకుంది. మంగళవారం వర్షం అంతరాయం కలిగించిన పోరులో యశస్వి జైస్వాల్ (32 బాల్స్లో 40 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆర్ఆర్ 27 రన్స్ తేడాతో ముంబై ఇండియన్స్ను ఓడించింది. ఆడిన మూడు మ్యాచ్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్కు చేరుకుంది. 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగు వచ్చిన రాజస్తాన్ 150/3 స్కోరు చేసింది.వైభవ్ సూర్యవంశీ (14 బాల్స్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 39) కూడా దంచికొట్టాడు. అనంతరం ఛేజింగ్లో ముంబై 11 ఓవర్లలో 123/9 స్కోరు మాత్రమే చేసి ఓడిపోయింది. షెర్ఫానే రూథర్ఫర్డ్ (8 బాల్స్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25), నమన్ ధీర్ (13 బాల్స్లో 3 ఫోర్లు, 1 సిక్స్ 25) టాప్ స్కోరర్లు. రవి బిష్ణోయ్, సందీప్ శర్మ, బర్గర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. జైస్వాల్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# కోట్ల రూపాలు తీసుకునే ముందే తెల్వదా: ఓవర్సీస్ ప్లేయర్లపై గవాస్కర్ ఫైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఫారెన్ ప్లేయర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఫ్రాంచైజీలు పోటీ పడి మరీ కోట్లు కుమ్మరించి ఓవర్సీస్ ఆటగాళ్లను కొనుగోలు చేస్తాయి. కానీ కోట్ల జీతం తీసుకుంటున్నా విదేశీ ఆటగాళ్లు కొందరు లీగ్?కు అందుబాటులో ఉండటం లేదు. కొందరు వేలంలో పాల్గొని ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాక మేం ఆడమని చెబుతున్నారు. ఇంకొందరు లీగ్ స్టార్ట్ అయ్యాక వివిధ కారణాలతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నారు. వీళ్ల తీరుతో జట్టు సమతుల్యం దెబ్బతిని ఆయా ఫ్రాంచైజీలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఓవర్సీస్ ప్లేయర్ల తీరుపై భారత మాజీ క్రికెటర్ గవాస్కర్ ఫైర్ అయ్యారు. తమ హెల్త్ కండిషన్ ఎలా ఉంది..? టోర్నీకి పూర్తిగా అందుబాటులో ఉంటామా లేదా అనే విషయం ఆటగాళ్లకు ముందే తెలియదా అని ప్రశ్నించారు. తమకు చేతకాదని తెలిసినప్పుడు టోర్నీలో ఆడతామని రావడం ఎందుకని నిలదీశారు. టీ20ల్లో ఒక బౌలర్ కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే వేస్తాడని.. ఆ నాలుగు ఓవర్లు వేసేందుకు కూడా శరీరం సహకరించపోతే క్రికెట్ ఆడటం కన్నా రెండు నెలలు రెస్ట్ తీసుకోవడమే మంచిదని చురకలంటించారు. అంతేకానీ కోట్లకు కోట్ల రూపాయలు జీతం తీసుకుంటూ ఫ్రాంచైజీలను ఇబ్బంది పెట్టడం సబబు కాదని అన్నారు. ఒక ఆటగాడికి దేశమే ముఖ్యం ఇందులో ఎలాంటి సందేహం లేదు.. కానీ కోట్ల రూపాయలు తీసుకుంటున్న ఫ్రాంచైజీల పట్ల కూడా నిబద్ధత చూపించాలి కదా అని అన్నారు. షెడ్యూల్ అడ్జస్ట్?మెంట్ కాకపోతే మొత్తం టోర్నీకి దూరంగా ఉంటే ఎవరికీ ప్రాబ్లమ్ ఉండదని.. కానీ ఫ్రాంచైజీలు కొనుగులు చేసిన తర్వాత మధ్యలోనే వదిలి వెళ్లడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కొన్ని దేశాల క్రికెట్ బోర్డులు ఐపీఎల్ ఆడేందుకు ఆటగాళ్లకు ఎన్వోసీ ఇవ్వకపోవడంపై కూడా గవాస్కర్ సీరియస్ అయ్యారు. ప్రతి విదేశీ ఆటగాడి ఐపీఎల్ జీతంలో 10% ఫీజును ఆయా దేశాల క్రికెట్ బోర్డులు తీసుకుంటాయి. ప్రపంచంలోని మరే ఇతర టీ20 లీగ్‌లోనూ ఇలాంటి నిబంధన లేదు. ఐపీఎల్ కేవలం విదేశీ ఆటగాళ్లకే కాకుండా వారి బోర్డులకు కూడా కాసుల పంట పండిస్తున్నప్పుడు టోర్నీలో ఆడేందుకు ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ , జోష్ హేజిల్‌వుడ్ వంటి ఆటగాళ్లు వివిధ కారణాలతో ఐపీఎల్ 2026లో ఇంకా ఆడలేదు. ఫిట్‌నెస్ పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేదని శ్రీలంక క్రికెట్ బోర్డు వనిందు హసరంగా, ఈషాన్ మలింగ, మతీష పతిరానా ఎన్వోసీ ఇవ్వలేదు.

# బుమ్రా బౌలింగ్‌లో స్కోరు చేస్తానని చెప్పి చేసి చూపించాడు...
# అతడ్ని టీమిండియాలోకి తీసుకోవాలి: ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యలు




**హైదరాబాద్ పెన్ పవర్:** "గత ఏడాది బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాను. ఈసారి అతడి బౌలింగ్‌లో పరుగులు చేయాలి"... ఇది ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పెట్టుకున్న లక్ష్యం. చెప్పడమే కాదు, గతరాత్రి ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ స్థాయి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో
దూకుడుగా ఆడి దాన్ని చేసి చూపించాడు. ఈ అద్భుత ప్రదర్శనపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసల వర్షం కురిపించాడు.వైభవ్ ప్రదర్శనపై స్పందించిన ఇర్ఫాన్, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడు. "వైభవ్ ఒక యువ సంచలనం. 15 ఏళ్ల వయసులో వైట్ బాల్ క్రికెట్‌లో ఇంతటి పరిణతితో కూడిన ప్రదర్శన అసాధారణం. బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం. అలాంటిది, అతడిపై పరుగులు చేస్తానని చెప్పి, చేసి చూపించాడు. తన లక్ష్యాన్ని చేరుకున్నాడు" అని ఇర్ఫాన్ కొనియాడాడు."ఈ కుర్రాడిని ఎక్కువ కాలం వేచి చూసేలా చేయొద్దు. ఇప్పుడే జాతీయ జట్టులోకి తీసుకుంటే, అతడు సుమారు 20 ఏళ్ల పాటు దేశానికి సేవలందించగలడు" అని ఇర్ఫాన్ అభిప్రాయపడ్డాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అగ్రశ్రేణి బౌలర్లను సైతం ఎదుర్కొని నిలకడగా రాణిస్తుండటంతో, ఇర్ఫాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పర్ఫెక్షన్ కోసం వెనుకడుగేసిన ఎన్టీఆర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ డ్రాగన్ ప్రస్తుతం అనూహ్యంగా వార్తల్లో నిలిచింది. ఈ నెలలో ప్రారంభం కావాల్సిన కీలక షూటింగ్ షెడ్యూల్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో, సినిమా రిలీజ్ పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రకటించిన రిలీజ్ డేట్ మిస్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది.

**లుక్ తో అసంతృప్తి**

అయితే ఈ బ్రేక్ వెనుక ఉన్న కారణం ఏదో నార్మల్ రీజన్ కాదు. సినిమా కోసం రెడీ చేసిన కొత్త లుక్ విషయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇద్దరూ పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో షూట్‌ను ఆపాలని డిసైడ్ అయ్యారట. పర్ఫెక్షన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, లేటైనా సరే బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.



**మే లో కొత్త షెడ్యూల్**

కాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పలు వేరియేషన్లలో కనిపించనున్నారని తెలుస్తోంది. మల్టిపుల్ లుక్స్‌తో పాటు కొత్త గెటప్స్‌పై ప్రయోగాలు జరుగుతుండటంతో, ఆయన కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా నిలవొచ్చనే అంచనాలను పెంచుతోంది. అభిమానులు కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ స్కేల్ పరంగా కూడా డ్రాగన్ ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇప్పటికే



జోర్డాన్‌లో ఒక కీలక షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్, ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఆలయంలో వారం రోజులపాటు షూటింగ్ నిర్వహించింది. ప్రస్తుతం నగర అవుట్‌స్కర్ట్స్‌లో భారీ సెట్ నిర్మాణం జరుగుతుండగా, అక్కడి నుంచే వచ్చే నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ పాన్- ఇండియా స్థాయిలో విజువల్ గ్రాండియర్‌గా నిలవబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**డ్రాగన్ విషయంలో తారక్ పై భారీ ఒత్తిడి**

ఇదిలా ఉండగా, బాలీవుడ్‌లో వచ్చిన వార్2 తర్వాత ఎన్టీఆర్‌కు ఈ సినిమా అత్యంత కీలకంగా మారింది. వార్2 తో ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, డ్రాగన్ ద్వారా ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఒత్తిడి కూడా అతనిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ పై అభిమానుల అంచనాలు కూడా భారీగా పెరిగాయి. సోషల్ మీడియాలో ఈ డిలే అంశంపై మిక్స్ రియాక్షన్ కనిపిస్తోంది. కొంతమంది అభిమానులు ఇంకెంత లేట్? అంటూ అసహనం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం మంచి అవుట్‌పుట్ కోసం సమయం తీసుకోవడం సరైన నిర్ణయమేనని టీమ్‌కు మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి, డ్రాగన్ టీమ్ తీసుకున్న ఈ డెసిషన్ రిస్క్‌తో కూడుకున్నదే. ఒకవైపు డిలే వల్ల మార్కెట్‌లో ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు పర్ఫెక్ట్ అవుట్‌పుట్ సాధిస్తే అది భారీ రివార్డ్‌గా మారే అవకాశం ఉంది. కంటెంట్‌పై ఉన్న కాన్ఫిడెన్స్, క్లియర్ విజన్‌తో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్ట్ నిజంగా తారక్ లైఫ్ లో గేమ్ ఛేంజర్ అవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965